# ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో..

# పోలీసు కస్టడీకి నిందితులు

- రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో విచారించిన సిట్ అధికారులు



**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నిందితులను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. హైదరాబాద్ చంచల్‌గూడ జైలులో ఉన్న ముగ్గురు నిందితులను రెండ్రోజుల పోలీస్ కస్టడీకి ఎసిబి కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. దీంతో గురువారం ఉదయం చంచల్‌గూడ జైలుకు చేరుకున్న మొయినాబాద్ పోలీసులు నిందితులు నందకుమార్, రామచంద్రభారతి, సింహయాజి స్వామిని తమ కస్టడీలోకి తీసుకున్నారు. అటు నుంచి రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్యేలకు ఎర కేసు అత్యంత సున్నితమైనది కావడం, సంచలనాత్మకంగా మారడంతో ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాల్సి ఉంటుందని, అనుభవజ్ఞులైన అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని డిజిపి మహేందర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న సర్కారు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసింది. ఆయనతో పాటు నేరాల దర్యాప్తులో అపార అనుభవం, నూతన సాంకేతికతను ఉపయోగించుకోవడంలో నైపుణ్యం ఉన్న ఉన్నతాధికారులను ఈ బృందంలో సభ్యులుగా నియమించింది. నల్లగొండ ఎస్‌పి రెమా రాజేశ్వరి, సైబరాబాద్ డిసిపి కల్మేశ్వర్ సింగన్వర్, శంషాబాద్ డిసిపి జగదీశ్వర్‌రెడ్డి, నారాయణపేట ఎస్‌పి వెంకటేశ్వర్లు, రాజేంద్రనగర్ ఎసిపి గంగాధర్, మొయినాబాద్ ఎస్‌హెచ్‌ఒ లక్ష్మీరెడ్డి ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ముగ్గురు నిందితులను వేరువేరు గదుల్లో ఒక్కొక్కరిని సిట్ అధికారులు విచారించారు. నకిలీ పాన్ కార్డు, ఆధార్ కార్డు ఎలా వచ్చాయని అధికారులు ఆరా తీస్తున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యేల కొనుగోలు విషయంలో వెనుక ఉన్నవారి గురించి విచారిస్తున్నారు. శుక్రవారమూ విచారణ కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**సిట్‌ను వ్యతిరేకిస్తున్నారంటే దొంగలన్నట్టే కదా : తమ్మినేని**

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల కొనుగోళ్ల వ్యవహారానికి సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే బిజెపి నేతలు ఎందుకు వ్యతిరేకిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రశ్నించారు. ఆ వ్యవహారంతో సంబంధం లేకుంటే సిట్‌ను ఏర్పాటు చేసిన 24 గంటల్లోనే వారు హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎమ్మెల్యేల కొనుగోళ్ల వ్యవహారంలో సింహయాజీ, రామచంద్ర భారతి, నందకుమార్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారిని పోలీసులు తమ కస్టడీలోకి తీసుకునేందుకు నాంపల్లిలోని ఎసిబి కోర్టు అనుమతిచ్చింది. నిందితుల తరఫు న్యాయవాది సమక్షంలోనే సిట్ విచారణ చేపట్టనుంది. అయితే ఈ విచారణను సవాల్ చేస్తూ బీజేపీ నేత ప్రేమేందర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారని తమ్మినేని తెలిపారు. దీన్ని వద్దంటున్నారంటే బిజెపి నేతలు దొంగలన్నట్టే కదా?అని ఆయన విమర్శించారు. ఇది గుమ్మడి కాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్టుగా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేల కొనుగోళ్లకు సంబంధించి బిజెపికి ఎలాంటి సంబంధం లేదంటూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ యాదాద్రి వద్ద తడిబట్టలతో ప్రమాణం చేశారని గుర్తు చేశారు. అలాంటప్పుడు సిట్‌ను ఎందుకు వద్దనుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఎస్ఎల్ సర్టిఫైడ్ వీడియో ఫూటేజీ ఉందనీ,, దాన్ని అన్ని సంస్థలకూ రాష్ట్ర ప్రభుత్వం పంపించిందని గుర్తు చేశారు. వారి బాగోతం బయటపడుతుందనే సిట్‌ను వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించారని విమర్శించారు. ఇంకోవైపు ఈ వ్యవహారంపై సిబిఐతో విచారణ చేయించాలంటున్నారని తెలిపారు. ఇది వారి ద్వంద్వ స్వభావానికి నిదర్శనమని తెలిపారు. కావాలనే తమను ఇరుకిస్తుందనే దానిపై ఇంతకుముందు సుప్రీం కోర్టులోనూ పిటిషన్ వేశారని గుర్తు చేశారు. దొంగలెవరో తేల్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సిట్ ద్వారా విచారణ చేపడుతున్నదని పేర్కొన్నారు. కుట్రలు, కుతంత్రాలతో రాష్ట్రాన్ని వశం చేసుకోవాలని బిజెపి భావిస్తోందని విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులను ఇడి, సిబిఐ,ఐటి దాడులతో బెదిరిస్తున్నదని తెలిపారు. ఎమ్మెల్యేలను లొంగదీసుకోవాలని చూస్తున్నదని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.



సోమ భరత్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రులు

## విజయ డెయిరీ అభివృద్ధికి కృషి

### డెయిరీ నూతన ఛైర్మన్ సోమ భరత్ కుమార్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సిఎం కెసిఆర్, పాడి రైతుల, ఉద్యోగుల సహకారాన్ని తీసుకొని రానున్న రోజుల్లో విజయ డెయిరీ ఉన్నతికి పాటుపడుతానని రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య లిమిటెడ్ (టిఎస్‌డిడిసిఎఫ్) నూతన ఛైర్మెన్ సోమ భరత్ కుమార్ అన్నారు. హైదరాబాద్ లాలాపేట్‌లోని విజయ డెయిరీ ఆవరణలో గురువారం నూతన ఛైర్మెన్‌గా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు, శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు. నూతన ఛైర్మెన్‌కు వారు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పుష్కలంగా తాగునీరు ఉండటంతో పశుగ్రాసానికి కొరత లేదని, దీంతోపాటు పశువులు ఆరోగ్యకరంగా పెరిగే వాతావరణం ఉందన్నారు. కావాల్సిన పాలు మనమే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు సన్నాహాలు చేస్తామన్నారు. సిఎం సహకారం, ఉద్యోగుల, రైతుల సహకారంతో ముందుకు వెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు లింగయ్య యాదవ్, బండ ప్రకష్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, శోభన్ రెడ్డి, కమిషనర్ ఆధార సింహ, అధికారులు జియం కమేష్, మల్లికార్జున్, మల్లయ్య, అరుణ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పరిశ్రమలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- హాట్సన్ పరిశ్రమలో చాక్లెట్ విభాగాన్ని ప్రారంభించిన మంత్రి తలసాని

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

పరిశ్రమలను తమ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం గోవింద్‌పూర్ గ్రామంలో గురువారం హాట్సన్ పరిశ్రమ నూతనంగా ఏర్పాటుచేసిన చాక్లెట్ తయారీ విభాగాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పాడి పరిశ్రమల అనుబంధ పరిశ్రమలకు నాలుగు శాతం నుంచి 50 శాతం వరకు సబ్సిడీ కల్పిస్తున్నారన్నారు. మేడ్చల్ జీడిమెట్లలో రూ.20 కోట్లతో పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రూ.400 కోట్లతో జహీరాబాద్‌లో హాట్సన్ పరిశ్రమను స్థాపించి భారతదేశంలోనే అతి ఎక్కువ ఉత్పత్తిని సాధించే పరిశ్రమగా పేరుగాంచడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. 1970లో ప్రారంభమైన హాట్సన్ పరిశ్రమ దినదినాభివృద్ధి చెంది దేశ, విదేశాల్లో తెలంగాణ ఉత్పత్తులను విక్రయించే స్థాయికి ఎదగడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. హాట్సన్ పరిశ్రమ ఏర్పాటుతో స్థానిక రైతులకు ఉపాధితో పాటు అన్ని రకాల సౌకర్యాలు లభిస్తాయన్నారు. ఇక్కడి రైతుల పాలను సేకరించి మెరుగైన మద్దతు ధర ఇవ్వాలని మంత్రి సూచించారు. పరిశ్రమల స్థాపన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టాలను చేయడంతో తెలంగాణలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. సౌత్ ఏషియాలోనే పాల ఉత్పత్తి పెద్ద పరిశ్రమ జహీరాబాద్‌లో ఏర్పాటు కావడం శుభసూచకమన్నారు. పరిశ్రమల శాఖ చీఫ్ సెక్రటరీ జెఎస్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం 14 రకాల సబ్సిడీలను అందిస్తోందన్నారు. ఆహార ఉత్పత్తి పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. ఇరిగేషన్, నీటి, విద్యుత్ సౌకర్యాలు కల్పించడంతో డెయిరీ, చేపల ఉత్పత్తి, నూనెల తయారీ, పండ్ల పరిశ్రమలు లాంటి 30 పరిశ్రమలు ఏడేళ్లలో రాష్ట్రంలో ఏర్పాటయ్యాయన్నారు. ఎండి సత్య చంద్రమోహన్ మాట్లాడుతూ.. 97 వేల కిలోల చాక్లెట్ల ఉత్పత్తి ఒక్కరోజులోనే తయారు చేసే పరిశ్రమను జహీరాబాద్‌లో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ పరిశ్రమతో జహీరాబాద్ ప్రాంత ప్రజలకు ఉపాధి కలుగుతుందన్నారు. పరిశ్రమ ప్రారంభోత్సవం అనంతరం పరిశ్రమల్లో ఉత్పత్తులను మంత్రి శ్రీనివాస్ యాదవ్ తిరిగి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపి బిబి పాటిల్, ఎమ్మెల్యే మాణిక్యరావు, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, ఆసీస్ గౌరవ్, ప్రసన్నకుమార్, ప్రభంజన్, ఆత్మ కమిటీ ఛైర్మెన్ పెంటారెడ్డి, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మహమ్మద్ తన్వీర్, విజయకుమార్, ఆర్టిఒ రమేష్ బాబు, ఎస్‌పి, డిఎస్‌పి తదితరులు పాల్గొన్నారు.

## ఆల్‌కార్గోకు రూ.230 కోట్ల లాభాలు

**ముంబయి :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఆల్ కార్గో లాజిస్టిక్స్ నికర లాభాలు 13 శాతం తగ్గి రూ.230 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.263 కోట్ల లాభాలు సాధించింది. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.4,978 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ2లో 6.5 శాతం పెరిగి రూ.5,300 కోట్లకు పెరిగినట్లు ఆ కంపెనీ తెలిపింది.

## హైదరాబాద్‌లో ఇన్ఫోవ్యూ సిస్టమ్స్ కేంద్రం

**ప్రజాశక్తి - హైదరాబాద్**

అమెరికాకు చెందిన ఇన్ఫోవ్యూ సిస్టమ్స్ ఇంక్ హైదరాబాద్‌లో తన నూతన కేంద్రాని ప్రారంభించింది. ఇంటిగ్రేషన్, లెగసీ ఆధునీకరణ, క్లౌడ్ సేవల్లో ప్రత్యేకతలు కలిగిన ఈ సంస్థ గురువారం నగరంలో తన ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ (ఐడిసి)ను హైసియా ప్రెసిడెంట్ అండ్ డెలివరీ హెడ్ ఇన్ఫోసిస్ మనీషా సబూ ప్రారంభించారు. "దేశంలోనే వ్యాపారం, టెక్నాలజీలకు ప్రధాన కేంద్రాల్లో ఒకటైన హైదరాబాద్‌లో తన కొత్త డెవలప్ మెంట్, సర్వీసెస్ సెంటర్ ప్రారంభంతో ఇన్ఫోవ్యూ సిస్టమ్స్ ఇంక్ సంస్థ దేశంలో తన రెండో కంపెనీని విస్తరించింది. ఈ సంస్థ ఆగ్నేయాసియా, భారతీయ సంస్థలకు సరికొత్త టెక్నాలజీలను గుర్తించడం, అమలు చేయడం, నిర్వహించడంలో సహాయపడుతుంది. అదే సమయంలో మెరుగైన ఉత్పత్తులు, సేవలను సష్టించడం, ప్రోత్సహించడం, మద్దతు ఇవ్వడంలో ఐటీ కంపెనీలకు సహాయపడుతుంది." ఇన్ఫోవ్యూ సిస్టమ్స్ సిటిఒ సత్య శేఖర్ దాస్ మండల్ పేర్కొన్నారు.

## మునుగోడు ఎమ్మెల్యేగా కూసుకుంట్ల ప్రమాణం

- పలువురు మంత్రులు హాజరు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మునుగోడు ఎమ్మెల్యేగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ప్రమాణం స్వీకారం చేశారు. హైదరాబాద్ శాసనసభలోని తన చాంబర్‌లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి గురువారం ప్రభాకర్‌రెడ్డితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, జగదీష్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్‌తోపాటు, పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మెన్లు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులు, అసెంబ్లీ కార్యదర్శి వి నరసింహాచార్యులు పాల్గొన్నారు. అనంతరం కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి అసెంబ్లీ రూల్స్ బుక్స్, ఐడెంటిటీ కార్డును స్పీకర్ అందజేశారు. విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు. ఈ నెల మూడున ఉపఎన్నికలో కూసుకుంట్ల తాజా మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని ఓడించారు. ఆయనపై పది వేలకుపైగా ఓట్ల తేడాతో విజయం సాధించారు. ప్రమాణస్వీకారం అనంతరం ఆయన శాసనమండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ కూసుకుంట్ల ఎమ్మెల్యేగా గెలుపొందడం పట్ల అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## టిఆర్ఎస్ ఎంపి వద్దిరాజు రవిచంద్ర నివాసంలో ఇడి సోదాలు

### పలు కీలక పత్రాలు స్వాధీనం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

గ్రానైట్ కంపెనీ యజమానుల ఇళ్ళు, కార్యాలయాలపై గురువారమూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాడులు కొనసాగాయి. మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు పలువురు గ్రానైట్ కంపెనీల యజమాన్ల ఇళ్లలో సోదాలు నిర్వహించిన ఇడి....టిఆర్ఎస్ ఎంపి రవిచంద్ర నివాసంలో గురువారం తనిఖీలు చేసింది. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని ఆయన ఇంట్లో రాత్రి వరకు కొనసాగాయి.గ్రానైట్ కంపెనీలపై ఇడి అధికారులు జరిపిన దాడుల్లో పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. పలు కీలక డాక్యుమెంట్లు, ల్యాప్ టాప్‌లు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. వీటన్నింటినీ హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయానికి తరలించారు. వాటిని విశ్లేషించిన తర్వాత ఇడి అధికారులు సంబంధిత గ్రానైట్ కంపెనీల యజమానులకు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచే అవకాశముంది. హవాలా, మనీలాండరింగ్, నిబంధనలకు విరుద్ధంగా ఎగుమతులు చేసినట్టు ఇడి అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు పూర్తి ఆధారాలు సేకరించిన తర్వాత సదరు గ్రానైట్ కంపెనీల యజమానులను బాధ్యులు చేసే అవకాశముంది.

## ఆర్‌టిసి కార్మికుల సమస్యల్ని పరిష్కరించండి

### ఆ సంస్థ ఛైర్మెన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు సిఐటియు లేఖ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఆర్టీసి కార్మికుల పే స్కేల్, ఉద్యోగ భద్రత, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు వారు టిఎస్ఆర్‌టిసి ఛైర్మెన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు లేఖ రాశారు. 2019 జులై నుంచి కార్మికులకు బకాయిపడ్డ ఏడు డిఎలలో ఐదింటిని అమలు చేయడం, సమ్మెకాలపు జీతాన్ని చెల్లిస్తూ ఉత్తర్వులివ్వడం, పండుగ అలవెన్స్‌లు ఇప్పించడం లాంటివి మంచి పరిణామాలని పేర్కొన్నారు. అయితే, బకాయిపడ్డ 2017, 2021 వేతన ఒప్పందాలను వెంటనే అమలు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ భద్రతపై 2021లో విడుదల చేసిన మార్గదర్శకాలలో మార్పులు చేయాలని సూచించారు. సంస్థలో యూనియన్ల కార్యకలాపాలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం అనుసరిస్తున్న తీరుతో సిసిఎస్ తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నదని వాపోయారు.

## విమానాల పరిశోధన

- నవంబర్ 1 నుంచి ఏప్రిల్ 30 వరకు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఇస్రో, అటామిక్ ఎనర్జీ శాఖ సంయుక్తాధ్వర్యంలో ఏప్రిల్ 30 వరకు పది బెలూన్ విమానాలను పరిశోధన కోసం వినియోగించనున్నట్టు టాటా ఇన్ స్టిట్యూట్ ఆప్ ఫండమెంటల్ రీసర్చ్ సైంటిస్ట్ ఇన్‌ఛార్జ్ బి సునీల్ కుమార్ తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల ఒకటిన ప్రారంభమైందని తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. టాటా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసర్చ్ (ఇసిఐఎల్) నుంచి బెలూన్లలో హైడ్రోజన్ గ్యాస్, శాస్త్రీయ పరికరాలను నింపి పరిశోధన చేయనున్నట్టు తెలిపారు. ప్లాస్టిక్ ఫిలింలు 50 మీటర్ల నుంచి 85 మీటర్ల వరకు ఉంటాయనీ, సాధారణంగా రాత్రి ఎనిమిది గంటల నుంచి ఉదయం 6.30 గంటల మధ్య వీటిని ప్రారంభించనున్నట్టు తెలిపారు. పరిశోధన ఆధారంగా వీటిని 30 కిలోమీటర్లు, 42 కిలోమీటర్ల ఎత్తుకు ఎగురవేయనున్నట్టు తెలిపారు. ప్రజలు పారాచూట్‌లను చూస్తే వాటి నుంచి పరికరాలను తొలగించవద్దని కోరారు. అలాంటి సందర్భాల్లో సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

## మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ...

# నల్ల బెలూన్లతో నిరసన

- గిరిజన సంఘాల జెఎసి పిలుపు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 'నల్లబెలూన్ల'తో నిరసన తెలపాలని గిరిజన సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. తక్షణం గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనీ, అటవీ సంరక్షణ నియమాలు–2022 బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. దేశంలో గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం పది శాతానికి రిజర్వేషన్ పెంచాలనీ, బయ్యారం ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలంటూ కేంద్రాన్ని కోరింది. గిరిజన సంఘాల జెఎసి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జెఎసి నేతలు విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మనాయక్, ఆర్ శ్రీరాంనాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, టిఆర్ఎస్ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి రాజలింగం నాయక్, లంబాడీస్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవీందర్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సురేష్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర నాయకులు కె సోమ్లా నాయక్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం బాలు నాయక్, నాయకులు ఆర్ శేఖర్ నాయక్, ఆర్.పాండు నాయక్, గోరియా నాయక్, సురేష్ తదితరులు మాట్లాడుతూ తెలంగాణ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీల అమలు చేయాలనీ, గిరిజన వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలో భాగంగా తెలంగాణలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు కావస్తున్నా ఇంతవరకు యూనివర్సిటీని ఏర్పాటు చేయలేదని విమర్శించారు.

## సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న గవర్నర్

- రాజ్యాంగ పరిధిదాటి వ్యవహరించడం సరికాదు
- సిపిఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి



**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. రాజ్‌భవన్‌లో ప్రజాదర్బార్‌ను నిర్వహించి ఎవరైనా రావొచ్చు, సమస్యలపై వినతిపత్రాలు ఇవొచ్చనడం సరైంది కాదని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే సమస్యలను పరిష్కరిస్తుందని వివరించారు. సిఎం, మంత్రులకు అధికారాలుంటాయని పేర్కొన్నారు. గవర్నర్ రాజ్యాంగ పరిధి దాటి వ్యవహరించడం సమంజసం కాదని తెలిపారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను ఆపే అధికారం గవర్నర్‌కు లేదని విమర్శించారు. కానీ ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టి ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంకోవైపు రాష్ట్ర ప్రభుత్వంపై ప్రెస్‌మీట్ నిర్వహించి విమర్శలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. గవర్నర్ కేంద్రానికి రబ్బర్‌స్టాంప్‌లా, బిజెపి నాయకురాలిగా వ్యవహరిస్తున్నారని పేర్నొన్నారు. రాజ్యాంగ పరిధిలో చట్టప్రకారం గవర్నర్ గౌరవంగా వ్యవహరించాలనీ, అగౌరవంగా వ్యవహరించడం సరైంది కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించకుండా కేంద్రం చెప్పినట్టు, బిజెపి నాయకుల్లా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సూచించారు. ఇలాంటి వ్యవహారశైలిని మార్చుకోవాలని కోరారు. ఈ రకంగా అవలంబిస్తే రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయబోవని తెలిపారు. బిల్లులను తొక్కిపెట్టడం సరైంది కాదని పేర్కొన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా బిల్లులుంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే అధికారం గవర్నర్‌కు ఉందనీ, ఆపే అధికారం లేదని వివరించారు. తీరు మారకపోతే ప్రజలే గవర్నర్ పాత్రకు వ్యతిరేకంగా ఉద్యమించడంతోపాటు రాజ్‌భవన్‌ను ముట్టడించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రజలకు వ్యతిరేకంగా బిల్లులను తయారు చేస్తే ఆయా ప్రభుత్వాలకు వారే బుద్ధి చెప్తారని తెలిపారు.

## 'నిజాం' విద్యార్థుల చర్చలు విఫలం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

నిజాం కళాశాల హాస్టల్ విషయంలో విద్యార్థులకు, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్‌తో గురువారం రెండు విడతలుగా జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దాంతో విద్యార్థులు శుక్రవారం నుంచి తిరిగి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కళాశాల పూర్వ విద్యార్థి, రాష్ట్ర మంత్రి కెటిఆర్ కళాశాల జూబ్లీ వేడుకల్లో పాల్గొని విద్యార్థినుల కోసం హాస్టల్ నిర్మిస్తామని ఇచ్చిన హామీ మేరకు కళాశాల ప్రాంగణంలో నూతనంగా హాస్టల్ భవనం నిర్మించింది. ఆ హాస్టల్‌లో పీజీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ఆదేశాలు జారీ చేశారు. దాంతో వారం రోజులుగా డిగ్రీ విద్యార్థులు తమకే హాస్టల్ వసతి సౌకర్యం కల్పించాలని కళాశాలలో ఆందోళనలు చేస్తున్నారు. ఈ విషయం మంత్రి కెటిఆర్ దృష్టికి వెళ్లడంతో ఆయన విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి సమస్యను పరిష్కరించాలని సూచించారు. గురువారం రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో పది మంది విద్యార్థినులు గంటపాటు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో హాస్టల్‌లో 50 శాతం పీజీ, 50 శాతం డిగ్రీ విద్యార్థినులకు ప్రవేశం కల్పిస్తామని కమిషనర్ తెలిపారు. దాంతో విద్యార్థులు తాము మిగిలిన విద్యార్థులతో చర్చించి తిరిగి చర్చలకు వస్తామని ప్రకటించారు. సాయంత్రం నాలుగు గంటలకు మళ్లీ చర్చలు జరగగా నలుగురు విద్యార్థులే హాజరయ్యారు. హాస్టల్ మొత్తం డిగ్రీ విద్యార్థులకు కేటాయించాలనడంతో, మిట్టల్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఉద్యమాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ఇన్‌ఫార్మర్ నెపంతో ఒకరి హత్య

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో పోలీస్ ఇన్‌ఫార్మర్ పేరుతో సూరవీడు పంచాయతీ కొండాపురం గ్రామ సమీపంలోని బస్తరుగుంపునకు చెందిన ఒకరిని మావోయిస్టులు హత్య చేశారు. సబక గోపాల్ (55)ను బుధవారం రాత్రి గొడ్డళ్లతో నరికి, కత్తులతో పొడిచి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.



## పార్టీకి పూర్వవైభవం తేవాలి : చంద్రబాబు

### తెలంగాణ టిడిపి అధ్యక్షుడిగా కాసాని బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలుగుజాతి అభివృద్ధి కోసం ఎన్‌టిఆర్ రాజకీయాల్లోకి వచ్చారనీ, తెలంగాణ గడ్డపై తెలుగుదేశం పుట్టిందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు ఎన్ చంద్రబాబునాయుడు అన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఎన్‌టిఆర్ భవన్‌లో ప్రమాణ స్వీకారోత్సవంలో చంద్రబాబు మాట్లాడారు. టిడిపికి పూర్వవైభవం తెచ్చేందుకు కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. తెలుగుజాతి ఉన్నంతవరకు తెలుగుదేశం ఉంటుందని వ్యాఖ్యానించారు. అతి తక్కువ సమయంలో అధికారంలోకి వచ్చిన పార్టీ టిడిపి అని గుర్తు చేశారు. ఆర్థిక అసమానతలు పోయేవరకు టిడిపి పనిచేస్తూనే ఉంటుందని అభిప్రాయపడ్డారు. పాలనను పేదవాడి ఇంటిముందుకు తెచ్చి, రాజకీయాలకు కొత్త అర్థం ఇచ్చిన నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. తెలంగాణలో ఇరిగేషన్ అభివృద్ధికి, హైదరాబాద్‌లో ఐటి అభివృద్ధికి నాంది పలికిందని వివరించారు. కాసాని జానేశ్వర్ మాట్లాడుతూ హైదరాబాద్ నడిబొడ్డులో టిడిపి పుట్టిందన్న విషయం మర్చిపోవద్దన్నారు. 'చంద్రబాబు అంటే క్షమశిక్షణ... క్రమశిక్షణ అంటే చంద్రబాబు' అని అన్నారు. దివంగత సీనియర్ ఎన్‌టిఆర్ పిలుపుతో అన్ని జిల్లాల యువత టిడిపి జెండా పట్టుకున్నారని, రాష్ట్రంలో టిడిపికి పూర్వవైభవం తెచ్చేందుకు గ్రామ గ్రామాన తిరుగుతానన్నారు. ఎన్‌టిఆర్, చంద్రబాబు చేసిన అభివృద్ధి పనులే మనకు ఎజెండా అని, చంద్రబాబు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. సూర్యచంద్రులు ఉన్నంతవరకు తెలుగుదేశం ఉంటుందని చెప్పారు. రెండు రాష్ట్రాల నుంచి కార్యకర్తలు తరలివచ్చారు. పార్టీకి పూర్వవైభవం రావడానికి కృషిచేస్తానన్నారు. మన నాయకుడు చేసిన అభివృద్ధి పనులు చెబుతూ ముందుకు సాగుతామని వ్యాఖ్యానించారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలు టిడిపికి అండగా ఉన్నారని' అని కాసాని అన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ర్యాలీగా పెద్దసంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద ఎన్‌టిఆర్‌కు నివాళులు అర్పించి, టిడిపి కార్యాలయానికి అక్కడ నుంచి భారీ ర్యాలీతో చంద్రబాబు ఇంటికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అర్వింద్‌కుమార్‌గౌడ్, బక్కని నిర్సంహులు, ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి, రామేశ్వర్, తెలుగు మహిళ అధ్యక్షురాలు జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

**MIC Electronics Limited**

Regd. Off: Plot No. 192/B, Phase-II, IDA, Cherlapally, Rangareddi, Hyderabad, Telangana - 500051.
Ph: +91 40 27122222, +91 40 27133333. Website: www.mic.co.in, Email id: cs@mic.co.in.

2022 సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికం కొరకు స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం

(రు.కోట్లలో)

| వ. నెం. | వివరాలు | స్టాండ్‌అలోన్ 30-09-2022 ఆడిట్ చేయని | స్టాండ్‌అలోన్ 30-06-2022 ఆడిట్ చేయని | స్టాండ్‌అలోన్ 30-09-2021 ఆడిట్ చేయని | స్టాండ్‌అలోన్ 31-03-2022 ఆడిట్ చేసిన | కన్సాలిడేటెడ్ 30-09-2022 ఆడిట్ చేయని | కన్సాలిడేటెడ్ 30-06-2022 ఆడిట్ చేయని | కన్సాలిడేటెడ్ 30-09-2021 ఆడిట్ చేయని | కన్సాలిడేటెడ్ 31-03-2022 ఆడిట్ చేసిన |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | నిర్వహణ కార్యకలాపాల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం | 0.86 | 1.43 | 3.45 | 32.33 | 3.34 | 2.66 | 3.45 | 46.25 |
| 2 | ఈ కాలానికి నికర లాభం/(నష్టం)(పన్నుకు ముందు, మినహాయింపు అంశాలు) | (0.53) | (0.79) | (1.05) | 2.81 | (0.01) | (1.24) | (1.05) | 3.03 |
| 3 | ఈ కాలానికి నికర లాభం/(నష్టం) పన్నుకు ముందు, (మినహాయింపు అంశాల తరువాత) | (0.53) | (0.79) | (1.05) | 2.81 | (0.01) | (1.24) | (1.05) | 3.03 |
| 4 | ఈ కాలానికి నికర లాభం/(నష్టం) పన్ను తరువాత, మినహాయింపు అంశాల తరువాత) | (0.53) | (0.79) | (1.05) | 2.81 | (0.01) | (1.24) | (1.05) | 2.96 |
| 5 | ఈ కాలానికి మొత్తం సమీకృత ఆదాయం (ఈ కాలానికి లాభం/(నష్టం) (పన్ను తరువాత)మరియు (పన్ను తరువాత) సమీకృత ఆదాయం) | (0.53) | (0.79) | (1.05) | 2.81 | (0.01) | (1.24) | (1.05) | 2.96 |
| 6 | పెయిడప్ ఈక్విటీ షేర్ కేపిటల్ (షేరు ముఖవిలువ రు.2/- వంతున) | 44.29 | 44.29 | 11.01 | 44.29 | 44.29 | 44.29 | 11.01 | 44.29 |
| 7 | (రివాల్యుయేషన్ రిజర్వ్ మినహా) ఇతర ఈక్విటీ | - | - | - | 15.68 | - | - | - | 18.48 |
| 8 | షేరు తలసరి ఆదాయం రు.2/- వంతున(కొనసాగుతున్న, నిలిచిపోయిన కార్యకలాపాల ద్వారా) | | | | | | | | |
| | | (0.02) | (0.04) | (0.19) | 0.13 | (0.00) | (0.06) | (0.19) | 0.13 |
| | | (0.02) | (0.04) | (0.19) | 0.13 | (0.00) | (0.06) | (0.19) | 0.13 |

గమనిక: పైన పేర్కొన్న సమాచారం 30 సెప్టెంబర్ 2022తో ముగిసిన త్రైమాసికానికి ఆడిట్ జరగని ఆర్థిక ఫలితాల సమగ్ర నివేదిక సారాంశం. సెబి రెగ్యులేషన్స్ రెగ్యులేషన్ 33 ప్రకారం ఈ సమాచారం స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లలో దాఖలు చేయబడినది. కంపెనీ ఆర్థిక ఫలితాల నివేదిక కంపెనీ వెబ్‌సైట్ www.mic.co.in. తోపాటు www.bseindia.com,www.nseindia.comలో కూడా అందుబాటులో వుంటాయి. సెప్టెంబర్ 30,2022తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన ఏకీకృత, స్థిరీకృత ఆర్థిక ఫలితాలను ఆడిట్ కమిటీ సమీక్షించిన తరువాత కంపెనీ బోర్డాఫ్ డైరెక్టర్స్ నవంబర్ 10న జరిగిన సమావేశంలో ఆమోదింపబడినది.

By order of the Board
For MIC Electronics Limited
సం. కౌశిక్ యలమంచిలి
మేనేజింగ్ డైరెక్టర్
DIN: 07334243

స్థలం: హైదరాబాద్
తేదీ: 10-11-2022